జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక



చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com



బుధవారం | 18-2-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 595 పేజీలు: 4 వెల : రూ.7


## ఎంఆర్ఐ, సిటీ స్కాన్ రిపోర్టు కావాలంటే..

# వారం ఆగాల్సిందే!











వినిపిస్తున్నాయి. డబ్బు ఇచ్చినవారికి స్కాన్ త్వరగా, ఇవ్వనివారికి మాత్రం రోజుల తరబడి ఎదురుచూపులే అన్న ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి.

ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రైవేట్ ఆసుపత్రిలా వ్యవహారం

* రోజుల తరబడి తిప్పుతున్న రేడియాలజీ సిబ్బంది * నివేదికలు రాక ఆలస్యమవుతున్న శస్త్ర చికిత్సలు, వైద్య సేవలు * రోగుల బంధువులు నిలదీస్తే కొందరు రేడియాలజీ సిబ్బంది దురుసు ప్రవర్తన * రేడియాలజీ విభాగం సిబ్బంది తీరుపై విమర్శలు * ఆ విభాగంలో కొందరు పీజీ, హౌస్‌సర్జన్లదే హవా * కొరవడిన రిమ్స్ ఉన్నతాధికారుల పర్యవేక్షణ

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 17 (వార్త):** శ్రీకాకుళం సర్వజనీన ఆసుపత్రి (రిమ్స్)లోని రేడియాలజీ విభాగంలో కొందరు సిబ్బంది తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రోగులకు ఎంఆర్ఐ, సిటీ స్కాన్‌లు తీయడంలోనూ, ఆ నివేదికలు ఇవ్వడంలోనూ తీవ్ర జాప్యం చేస్తున్నారు. కొన్ని రోజు వారాల తరబడి ఆలస్యం చేస్తున్నారు. దీంతో రోగులు, వారి బంధువులు ఎంఆర్ఐ, సిటీ స్కాన్ కోసం రేడియాలజీ విభాగం చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సివస్తోంది. సాయంత్రం రండి.. రేపు రండి.. రిపోర్టు రడీ కాలేదు.. నిత్యం ఇవే మాటలు అక్కడి సిబ్బంది నోట వినిపిస్తోంది. దీంతో నిత్యం రేడియాలజీ విభాగం వద్ద అక్కడి సిబ్బంది, రోగుల బంధువుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంటోంది. శ్రీకాకుళం రేడియాలజీ విభాగం ప్రస్తుతం 'రోగ నిర్ధారణ కేంద్రం' కంటే 'రోగులకు శిక్ష విధించే కేంద్రం'లా మారిందన్న ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో కూడా ఎంఆర్ఐ, సిటీ స్కాన్లు 4 నుంచి 7 రోజులు ఆలస్యం అవుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనివల్ల శస్త్రచికిత్సలు వాయిదా పడుతున్నాయి, ఫాలోఅప్ చికిత్సలు జరగడం లేదు. 'రోగం ముందుగా తగ్గుతుందా? లేక స్కాన్ ముందుగా వస్తుందా?' అన్న స్థాయికి పరిస్థితి చేరిందని కొందరు రిమ్స్ వైద్యులే చలోక్తులు విసురుకుంటున్నారు.

### మేం చెప్పిన టైంకే రండి..

రేడియాలజీ విభాగంలో సిబ్బంది రోగులపై అరవడం, బెదిరించడం సర్వసాధారణమైంది. 'మేము చెప్పిన టైమ్‌కే రండి... ఇంకో స్లాట్ అడిగితే స్కాన్ మరిచిపోండి' అన్నట్టు ప్రవర్తిస్తున్నారని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారదర్శక షెడ్యూలింగ్ వ్యవస్థ లేకుండా ఇష్టానుసారంగా టైమ్ స్లాట్లు కేటాయిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

### డబ్బు ఇస్తే స్కాన్... లేదంటే వెయిటింగ్..

మరో ఆందోళన కలిగించే అంశం ఏమిటంటే ఎంఆర్ఐ, సిటీ స్కాన్లకు కొంతమంది టెక్నీషియన్లు లంచాలు తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. డబ్బు ఇచ్చినవారికి స్కాన్ త్వరగా, ఇవ్వనివారికి మాత్రం రోజుల తరబడి ఎదురుచూపులే అన్న ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి. ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రైవేట్ ఆసుపత్రిలా వ్యవహారం నడుస్తోందని ప్రజలు మండిపడుతున్నారు. రేడియాలజీ రిపోర్టుల నాణ్యతపై కూడా తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చాలా స్కాన్లు సీనియర్ డాక్టర్లు లేదా అసిస్టెంట్ ప్రొఫెసర్లు రిపోర్ట్ చేయడం లేదు. ఫస్ట్ ఇయర్ పీజీలు, హౌస్ సర్జన్ల చేతే రిపోర్టులు తయారవుతున్నాయన్న గుసగుసలు ఉన్నాయి. ఈ విభాగంలో సీనియర్ డాక్టర్లు కనిపించడం లేదు.. మొత్తం పీజీల చేతుల్లోనే నడుస్తోంది. రేడియాలజీ విభాగంలో సీనియర్ డాక్టర్లు విధులకు సక్రమంగా రాకపోవడం, పర్యవేక్షించకపోవడంతో పీజీలు తమకు నచ్చినట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

### సకాలంలో రిపోర్టులు రాక..
### రోగుల చికిత్సపై తీవ్ర ప్రభావం

ఎంఆర్ఐ, సీటీ స్కాన్ నివేదికలు రావడంలో ఆలస్యం వల్ల అత్యవసర రోగులకు చికిత్స ఆలస్యం అవుతోంది. ట్రామా, క్యాన్సర్ రోగులకు శస్త్ర చికిత్సలు ఆలస్యం వల్ల ఇబ్బందులు పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో పేద రోగులు ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లకు వెళ్లాల్సి వస్తోంది. ఇతర విభాగాల వైద్యులు కూడా రేడియాలజీ వైఫల్యం మొత్తం ఆసుపత్రి పనితీరునే దెబ్బతీస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### తక్షణ విచారణకు డిమాండ్

రిమ్స్‌లోని శ్రీకాకుళం రేడియాలజీ విభాగంపై హై లెవల్ విచారణ జరిపించాలన్న డిమాండ్ సర్వత్రా వినిపిస్తోంది. ఎంఆర్ఐ, సిటీ స్కాన్ షెడ్యూలింగ్, రిపోర్టింగ్‌పై ఆడిట్ చేయిస్తే వాస్తవాలు బయటపడే అవకాశం ఉంది. సిబ్బంది హాజరు, విధి నిర్వహణపై నిఘా పెట్టాలని, లంచాలు, నిర్లక్ష్యం, దురుసు ప్రవర్తన, తప్పు రిపోర్టులపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని రోగుల బంధువులు కోరుతున్నారు.


## చక్రతీర్ధ స్నానాలకు పటిష్ట పోలీసు బందోబస్తు

* భక్తులకు అసౌకర్యం లేకుండా సమగ్ర ప్రణాళిక
* ప్రైవేట్ డ్రోన్ల వినియోగం నిషేధం
* సమన్వయంతో విధులు నిర్వర్తించాలి
* పోలీసులకు భక్తులు సహకరించాలి
* జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి



## జూన్ నుంచి కేంద్రీయ విద్యాలయ తరగతులు

* ఏప్రిల్‌లో ఆర్వోబీ పూర్తి కావాలి
* కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు
* పలాస పట్టణంలో మంత్రి సుడిగాలి పర్యటన



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## పోక్సో కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష

**మందస, ఫిబ్రవరి 17(వార్త):** పోక్సో కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష, జరిమానా విధించారని మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన మందసలో విలేఖరులతో మాట్లాడారు. మందస పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోక్సో చట్టం-2012 కేసులో నిందితుడికి పోక్సో కోర్టు శిక్ష విధించిందన్నారు. 2019, డిసెంబర్ 30న మధ్యాహ్నం సుమారు 1.30 సమయంలో తన కుమార్తెతో ఆమె తండ్రి గత రెండు సంవత్సరాలుగా అసభ్యకరంగా మాట్లాడడం, వెకిలి చేష్టలతో మానసికంగా వేధించడం, ఒక సందర్భంలో స్కూల్ నుండి వస్తుండగా ఆమె చేయి పట్టుకొని ఆపి అసభ్యకరంగా మాట్లాడడం వంటి చర్యలకు పాల్పడడడంతో ఆమె ఫిర్యాదు చేసిందన్నారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన అప్పటి మందస ఎస్ఐ సీహెచ్ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి, సాక్ష్యాధారాలు సేకరించి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారని తెలిపారు. ప్రాసిక్యూషన్ తరపున జి.వి ఎస్.యు. విశాలాక్షి వాదనలు వినిపించారు. నిందితుడు చేసిన నేరం రుజువు కావడంతో శ్రీకాకుళం పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎన్.సునీత ఈనెల 16న పోక్సో చట్టం కింద ఒక సంవత్సరం సాధారణ కారాగారశిక్షతో పాటు రూ.500 జరిమానా విధించారు. అదేవిధంగా సెక్షన్ 506ఐపీసీ కింద 6 నెలల కారాగార శిక్ష విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఒక నెల కారాగార శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారన్నారు. పిల్లలపై లైంగిక వేధింపుల కేసుల విషయంలో జిల్లా పోలీసులు కఠినంగా వ్యవహరిస్తారని, ఇలాంటి ఘటనలు గమనించిన పక్షంలో తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ కోరారు.



## విద్యార్థులకు ఆల్బండజోల్ మాత్రల పంపిణీ



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 17(వార్త):** జాతీయ నులిపురుగుల దినోత్సవంలో భాగంగా బలగ సమీపంలో ఉన్న ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులందరికీ మంగళవారం ఆల్బండజోలు మాత్రలను పంపిణీ చేశామని ప్రధానోపాధ్యాయులు డి.శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ హరినాయుడు, వైద్యాధికారి, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## అన్న ప్రసాద వితరణ



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 17(వార్త):** కృత్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రావికంఠ పేట వాస్తవ్యులు పాగోటి భాను, శ్రావణి దంపతులు తమ కుమారుడు రిత్విక్ పుట్టినరోజు సందర్భంగా 35 మంది అనాథలు, వృద్ధులు, వికలాంగులకు అన్న ప్రసాదం వితరణ చేశారు. వీరికి కృత్విక్ ఫౌండేషన్ చైర్మన్ చిగురుపల్లి. చిన్ను ధన్యవాదములు తెలియజేశారు. కార్యక్రమంలో లింగిబేరి ఆనంద్, బొడ్డేపల్లి చంద్రశేఖర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## సోములయ్యకు 'సాహితీ శిరోమణి' బిరుదు



**మందస, ఫిబ్రవరి 17(వార్త):** మందస మండలంలోని కిల్లోయికాలనీకి చెందిన ఉపాధ్యాయుడు సవర సోములయ్యకు 'సాహితీ శిరోమణి' బిరుదు దక్కింది. సోములయ్య రాసిన నా ఉద్దానం తల్లి కన్నీరు అనే కవితను ఆయనే స్వయంగా కవితా గానం చేసినందుకు సాహితీ శిరోమణి బిరుదు వరించింది. శ్రీకాకుళంలో శ్రీశ్రీ కళావేదికపై జరిగిన సిక్కోల్ సాహితీ సంబరం జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో అంతర్జాతీయ కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్, ముఖ్య అతిథిగా సారధి తదితరులు చేతుల మీదగా ఈ బిరుదు ఆయన అందుకున్నారు. ఈ సందర్భంగా సోములయ్య మాట్లాడుతూ నేను పొందిన సాహితీ శిరోమణి బిరుదును నా ప్రియమైన ఆదివాసీలకు అంకితం చేస్తున్నానన్నారు. 'సాహితీ శిరోమణి' బిరుదు పొందిన సోములయ్యకు గిరిజన సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, గిరిజనులు అభినందనలు తెలిపారు.

## అవగాహనతోనే ఆరోగ్యాంధ్రప్రదేశ్



**మందస, ఫిబ్రవరి 17(వార్త):** గ్రామీణ ప్రాంతాల్లో సరైన అవగాహన తోనే ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధ్యపడుతుందని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసిన (ఎఫ్.ఎన్.హెచ్.డబ్లు) ఆహారం, పోషణ, ఆరోగ్యం, పారిశుద్ధ్య కార్యక్రమాలపై శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతీ కుటుంబానికి సరైన అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరూ తీసుకోవాలని కోరారు. ప్రతీ కుటుంబం ఆరోగ్యంగా ఉండాలంటే ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన కిచెన్, గార్డియన్, న్యూట్రి గార్డియన్‌లో ఆకుకూరలు, కాయగూరలు ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ఆరోగ్యం కోసం ప్రతీ ఒక్కరికీ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలును పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లీగల్ కోఆర్డినేటర్ తారక మోహన్, మండల సమాఖ్య అధ్యక్షురాలు రమణమ్మ, కోశాధికారి శారద, ఉపాధ్యక్షురాలు భారతి, అకౌంటెంట్ కళ్యాణి, కంప్యూటర్ ఆపరేటర్ రాజా తదితరులు పాల్గొన్నారు.



# అభినవ భగీరథి శిరీష

### -పలాస దాహార్తి తీర్చనున్న ఎమ్మెల్యే
### -రూ.121.99 కోట్లు

### మంజూరు చేసిన ప్రభుత్వం

**పలాస, ఫిబ్రవరి 17(వార్త):** పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల ప్రజల చిరకాల స్వప్నం నెరవేరింది. దశాబ్దాలుగా ప్రధాన సమస్యగా పట్టిపీడిస్తున్న తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపే చారిత్రాత్మక ఘట్టానికి తెరలేచింది. పలాస నియోజకవర్గ ఎమ్మెల్యే గౌతు శిరీష అవిశ్రాంత కృషి, అకుంఠిత దీక్ష, తన ప్రజలపై ఉన్న అపారమైన ప్రేమ ఫలించి, పలాస మున్సిపాలిటీకి పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి (యుఐడిఎఫ్) కింద రూ. 121.99 కోట్ల భారీ నిధులు మంజూరయ్యాయి.

### పట్టువదలని పోరాట పటిమ

ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి గౌతు శిరీష తాగు నీటి సమస్య పరిష్కారాన్నే ప్రథమ కర్తవ్యంగా స్వీకరించారు. జంట నగరాల ప్రజలు పడుతున్న ఆవేదనను, బిందెలతో నీటి కోసం పడుతున్న కష్టాలను తన కళ్లారా చూసి చలించిపోయారు. ఈ సమస్య తీవ్రతను ప్రభుత్వానికి తెలియజేయాలనే దృఢ సంకల్పంతో, ఆమె పలు మార్లు రాజధాని అమరావతికి వెళ్లి మున్సిపల్ శాఖా మంత్రికి, ఉన్నతాధికారులకు విన్నవించారు. కేవలం విజ్ఞప్తి చేయడమే కాకుండా, ప్రాజెక్టు ఆవశ్యకతను, సాంకేతిక వివరాలను సమర్పిస్తూ, నిధులు మంజూరయ్యే వరకు పట్టువదలని విక్రమార్కురాలిలా పోరాడారు. తన నియోజకవర్గ ప్రజలపై ఆమెకున్న ప్రేమ, బాధ్యతలకు ఈ చారిత్రాత్మక విజయమే నిలువుటద్దం.

### ప్రభుత్వ ఉత్తర్వులు, నిధుల కేటాయింపు..

మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ, 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను జీవో ఆర్‌టీ నెంబర్ 467 ద్వారా రాష్ట్రవ్యాప్తంగా నీటి సరఫరా ప్రాజెక్టులకు అనుమతి మంజూరు చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం మొత్తం రూ.1702.68 కోట్ల ప్రాజెక్టులో భాగంగా, పలాస మున్సిపాలిటీకి ప్రత్యేకంగా రూ. 121.99 కోట్లు కేటాయించారు. ఏపీయూఈఎఫ్ ఐడీసీ ద్వారా సమగ్ర ప్రాజెక్టు నివేదికలను జాతీయ గృహ నిర్మాణ బ్యాంకు మార్గదర్శకాలకు అనుగుణంగా రూపొందించి సమర్పించడంతో ఈ నిధులు ఖరారయ్యాయి. వంద కోట్లకు పైగా నిధులు సాధించిన అతికొద్ది మున్సిపాలిటీలలో పలాస ఒకటిగా నిలవడం విశేషం.



### అంబరాన్నంటిన సంబరాలు..

ఈ శుభవార్త తెలియగానే పలాస-కాశీబుగ్గలో పండుగ వాతావరణం నెలకొంది. ప్రజా ప్రతినిధులు, ప్రజలు, అభిమానులు గాంధీ విగ్రహం నుంచి పలాస మూడు రోడ్ల కూడలి వద్దకు భారీగా చేరుకొని బాణాసంచా కాలుస్తూ, స్వీట్లు పంచుకుంటూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. "మున్సిపాలిటీ రాజకీయ చరిత్రలో ఇంత పెద్ద మొత్తంలో నిధులు మంజూరు కావడం ఇదే ప్రథమం అని, ఇదంతా శిరీష నాయకత్వ పటిమ, ప్రజలపై ఆమెకున్న ప్రేమకు నిదర్శనం" అని ప్రజలు ముక్తకంఠంతో హర్షధ్వానాలు చేశారు.

### శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు

ఈ నిధులతో ఇకపై జంట నగరాల్లోని ప్రతీ ఇంటికి స్వచ్ఛమైన త్రాగునీరు అందనుంది. భవిష్యత్తులో నీటి ఎద్దడి తలెత్తకుండా శాశ్వత చర్యలు చేపట్టనున్నారు. పలాసపై తనకున్న మమకారాన్ని, ప్రజల పట్ల తనకున్న బాధ్యతను మాటల్లో కాకుండా చేతల్లో చూపి, ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు.

# జేఈఈ మెయిన్స్‌లో రాహుల్ సత్తా





**మందస, ఫిబ్రవరి 17(వార్త):** జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఉద్దానానికి చెందిన సాలిన రాహుల్ సత్తా చాటారు. మందస మండలంలోని బహడపల్లి గ్రామానికి చెందిన రాహుల్ సామాన్య కుటుంబానికి చెందిన విద్యార్థి. ఎంతో పట్టుదల, అంకితభావంతో చదివిన రాహుల్ 98.416 శాతం మార్కులు సాధించారు.

రాహుల్ తండ్రి జానకిరావు బహడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీఆర్పీగా పని చేస్తున్నారు. తల్లి నిర్మల సాధారణ గృహిణి. ఒకటవ తరగతి నుంచి 10వ తరగతి వరకు రాహుల్ బహడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనే చదువుకున్నారు. అనంతరం ఇంటర్ మీడియల్ ఓ ప్రైవేట్ కళాశాలలో చదువుకున్నాడు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ ఐఐటీ కంప్యూటల్ సైన్స్ చదువుకోవాలని ఉందన్నారు. ఇదిలా ఉండగా సరస్వతీ పుత్రుడుగా గుర్తింపు పొందిన రాహుల్ పలు అవార్డులు, రివార్డులు, సన్మానాలు పొందారుఉ.

## రోగి మహేష్‌కు ఆర్థిక సాయం



**మందస, ఫిబ్రవరి 17(వార్త):** మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన రాంపురం గ్రామానికి చెందిన జుత్తు లక్ష్మీనారాయణ కుమారుడు జుత్తు మహేష్ అనారోగ్యంతో బాధ పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న తెలుసుకుని పెద్దదున్నవూరు గ్రామానికి చెందిన స్నేహితులు మహేష్‌ను, ఆయన తల్లిదండ్రులను కలిసి, ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. రూ.10,600లు సాయం అందజేశారు. కార్యక్రమంలో దున్నవూరు గ్రామానికి చెందిన మిత్రులు తామాడ తుంభనాథం, తామాడ హేమరాజు పాల్గొన్నారు.

### సోంపేట జూనియర్ కళాశాలలో ..

# ఘనంగా ఫేర్‌వెల్




**సోంపేట, ఫిబ్రవరి 17(వార్త):** సోంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఫేర్‌వెల్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎ.మోహనరావు ఆధ్వర్యంలో అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు కలసి చేపట్టిన ఈ కార్యక్రమం అభ్యంతరము ఎంతో ఉత్సాహంగా..ఆసక్తిగా సాగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మోహనరావు మాట్లాడుతూ విద్యార్థులు ప్రధానంగా చదువుపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని మంచి మెరుగైన ఫలితాలు సాధించాలని కోరారు. మార్కుల కోసం చదువకుండా మంచి భవిష్యత్తు కోసం క్రమశిక్షణతో చదవాలన్నారు. చదువు ద్వారా సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని వ్యక్తిగతంగా ఉత్తమమైన భవిష్యత్తు నిర్మాణం జరుగుతుందని సూచించారు. మంచి పట్టుదల కృషితో చదివినప్పుడు తప్పకుండా విద్యార్థులు సత్ఫలితాలు సాధిస్తారని అన్నారు. చదువు కోసం వేరొకరు ఒత్తిడి చేయవలసిన అవసరం లేకుండా విద్యార్థుల స్వతహాగా చదువు పట్ల దృష్టి సారించాలని అన్నారు.

### ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. సినీ గీతాలకు హుషారైనా స్టెప్పులను జోడించి వేసిన డ్యాన్సులు ఆకట్టుకున్నాయి. సిబ్బంది వెంకటరావు, రజనీకుమారి, రామినాయుడు, యుగంధర్, సంధ్యారాణి, కల్పన, విశ్వేశ్వరరావు నారాయణ, శ్రవణ్ కుమార్, దుర్యోధన, బాలకృష్ణ, నిర్మల, సునీల పాల్గొన్నారు.




## ఆల్బెండజోల్ మాత్రలతో మంచి ఆరోగ్యం



**కంచిలి, ఫిబ్రవరి 17(వార్త):** ఆల్బెండజోల్ మాత్రలను విద్యార్థులు తప్పనిసరిగా వేసుకుంటూ మంచి ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని కంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.జగదీష్‌కుమార్ పేర్కొన్నారు. కళాశాలలో మంగళవారం విద్యార్థులకు మాత్రలను అందజేశారు. కడుపులో పేరుకుపోయిన నులిపురుగుల నివారణకు ఈ మాత్రలు ఎంతగానో పనిచేసే పురుగులను నివారిస్తాయని అన్నారు. తద్వారా మంచి ఆరోగ్యం సమకూరుతుందని చెప్పారు. ఎన్ఎస్ఎస్ పీవో నరసింహకుమార్, అధ్యాపకులు పట్నాయక్, రాంబాబు, చలపతి, సోమేశ్వరరావు భవిత వెంకట్రావు వేణుగోపాల్, కోదండరాం, మురళీకృష్ణ, భువన్ పంకజ్ పాల్గొన్నారు.

## తలతంపరకు సుజల తాగునీటి సౌకర్యం



**కంచిలి, ఫిబ్రవరి 17(వార్త):** తలతంపర గ్రామంలో ప్రజలకు మరింత మెరుగైన మంచినీటి సౌకర్యం కల్పించాలన్న లక్ష్యంతో ఆర్వో వాటర్ ప్లాంట్‌ను పున: ప్రారంభించారు. మండల టీడీపీ అధ్యక్షుడు మాదిన రామారావు కృషితో మంగళవారం ఈ ప్లాంట్‌ను ప్రారంభించి ప్రజలకు అందుబాటులో ఉంచారు. దీంతో సర్పంచ్ జగబంధు దళై, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎం.పూర్ణచంద్ర, అభిమన్యు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు

**మెళియాపుట్టి, ఫిబ్రవరి 17(వార్త):** పాఠశాలల్లోని విద్యార్థులతో ఆల్బెండ్‌జోలు మాత్రలు మింగించామని ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా తెలిపారు. జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంకా ఎవరైనా విద్యార్థులు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోకున్నట్లయితే వారిని గుర్తించి ఫిబ్రవరి 24న మాత్రలు వేసుకునేలా సంబంధిత సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి ఎస్.దేవేంద్రరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నమిత సాహు, కొసమల, నడసంద్ర జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు భాస్కర మిశ్రా, ఎస్.రాజేశ్వరి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ దివ్యశ్రీ, ఎమ్మెల్ హెచ్‌ఓ ఎల్.ఢిలేశ్వరరావు, ఎంపీహెచ్‌ఏ టి.పద్మావతి, ఎంపీహెచ్‌ఏ ఎఫ్ మౌనిక, ఏఎన్ఎం, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భవాని, భాగ్యలక్ష్మి, పాఠశాల సిబ్బంది, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## శ్రీ వెంకటసాయిలో నేషనల్ డీవార్మింగ్ డే

**సరుబుజ్జిలి, ఫిబ్రవరి 17(వార్త):** సరుబుజ్జిలిలోని శ్రీ వెంకటసాయి స్కూల్‌లో విద్యార్థులందరికీ ఆల్బెండజోల్ మాత్రలు మంగళవారం ఉచితంగా పంపిణీ చేశారు. విద్యార్థులు ముందుగా హ్యాండ్ వాష్ చేసుకుని, మాత్రలు ఏ విధంగా వేసుకోవాలి, పాటించాల్సిన జాగ్రత్తలను సరుబుజ్జిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్‌వో, సిబ్బంది అవగాహన కల్పించారు. అనంతరం ఆ మాత్రలను పిల్లలతో మింగించారు. ఈ మాత్రలు నమిలి మింగడం తో ఆవశ్యకతను విద్యార్థినీ, విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో శ్రీ వెంకట సాయి విద్యాసంస్థల చైర్మన్ కె.జగన్నాథం, ప్రిన్సిపాల్ పురుషోత్తమరావు, ఉపా ధ్యాయ, ఉపాధ్యాయ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



# పలాస అభివృద్ధికి 'శక్తిత్రయం'

### - కేంద్ర మంత్రి రామ్మోహన్, ఎమ్మెల్యే శిరీష, సమన్వయకర్త వెంకన్నచౌదరి

### సమష్టి కృషితో కొత్త శకం



**పలాస, ఫిబ్రవరి 17(వార్త):** పలాస-కాశీబుగ్గ నియోజకవర్గ భవిష్యత్తును బంగారు బాట పట్టించేందుకు ముగ్గురు నాయకులు "శక్తిత్రయం"గా ముందుకు సాగుతున్నారు. కేంద్ర మంత్రిగా కింజరాపు రామ్మోహన్ నాయుడు అందిస్తున్న అండ, ఎమ్మెల్యేగా గౌతు శిరీష చేస్తున్న అవిశ్రాంత పోరాటం, వారికి వారధిగా నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి అందిస్తున్న సహకారం. ఈ త్రిముఖ వ్యూహంతో పలాస అభివృద్ధి నేడు పరుగులు పెడుతోంది.

### ఒకరి ఆశయం.. మరొకరి ఆచరణ..

### అభివృద్ధికి చిరునామా

నియోజకవర్గ ప్రజలకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలన్నది ఎమ్మెల్యే గౌతు శిరీష ఆశయం. ఆ ఆశయ సాధన కోసం ఆమె చేసిన నిరంతర కృషి ఫలితంగానే పలాసకు కేంద్రీయ విద్యాలయం మంజూరైంది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు పురోగతిని పర్యవేక్షించేందుకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తో కలిసి సూదికొండ వద్ద స్థలాన్ని పరిశీలించారు.

ఈ కీలక కార్యక్రమంలో ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రతి నిధిగా, నియోజకవర్గ సమన్వయకర్తగా యార్లగడ్డ వెంకన్న చౌదరి..ఎమ్మెల్యే ఆశయాలను క్షేత్రస్థాయిలో ముందుకు నడిపిస్తూ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను కేంద్ర మంత్రికి వివరించారు.

ఎమ్మెల్యే అందుబాటులో లేని సమ యాల్లో కూడా, నియోజకవర్గ బాధ్యతలను తన భుజాలపై వేసుకొని, ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా వెంకన్న చౌదరి వ్యవహరిస్తున్న తీరు ఆయన చిత్తశుద్ధికి, బాధ్యతకు నిదర్శనంగా నిలుస్తోంది.

### 18 ఏళ్ల సమస్యకు ముగ్గురి కృషితో మోక్షం

పలాస ప్రజలను దశాబ్దాలుగా వేధిస్తున్న ఆర్‌ఓబీ సమస్య పరిష్కరించేందుకు ఈ ముగ్గురు నాయకుల చేసిన కృషిఇ వీరి సమష్టి విజయానికి ప్రబల నిదర్శనం. ఎమ్మెల్యే శిరీష ఈ ప్రజా సమస్యను గుర్తించి, దాని తీవ్రతను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చి, పరిష్కారం కోసం నిరంతరం గళం విప్పారు.

### వెంకన్న చౌదరి సమన్వయం :

ఎమ్మెల్యే పోరాటానికి క్షేత్రస్థాయిలో మద్దతుగా నిలుస్తూ, స్థానిక నాయకులను, అధికారులను సమన్వయపరుస్తూ, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

### కేంద్ర మంత్రి రామ్మోహన్ చొరవ :

వీరిద్దరి కృషికి కేంద్రం నుంచి కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు బలాన్ని చేకూర్చారు. తన పలుకుబడిని ఉపయోగించి, రాష్ట్ర ప్రభుత్వంపై భారం పడకుండా రూ.46 కోట్ల నిధులను మంజూరు చేయించి, 18 ఏళ్ల కలకు కార్య రూపం ఇచ్చారు. ఈ ఏప్రిల్ నాటికి ఆ పనులు పూర్తయ్యి, ప్రజల కష్టాలు ఈడేరనున్నాయి. శిరీష, వెంకన్న చౌదరి నియోజకవర్గాన్ని తమ కుటుంబంలా భావించి అహర్నిశలు శ్రమిస్తుంటే, వారికి పెద్దన్నలా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అండగా నిలవడంపై పలాస-కాశీబుగ్గ ప్రజలు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ త్రయం నాయకత్వంలో తమ ప్రాంతం అభివృద్ధికి కొత్త చిరునామాగా మారుతుందని వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## జేసీఐ ఆధ్వర్యంలో 'ఇగ్నైటింగ్ ది యంగ్ మైండ్స్'



**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 17(వార్త):** జేసీఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యార్థుల అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని "ఇగ్నైటింగ్ ది యంగ్ మైండ్స్" కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్ శరత్ బాబు, ఉప ప్రధానోపాధ్యాయులు నల్లనా రమేష్. జేసీఐ ఇచ్ఛాపురం చేపడుతున్న కార్యక్రమాలను అభినందించి, యువతను ప్రోత్సహించే ఇలాంటి కార్యక్రమాలకు తమ మద్దతును తెలిపారు. ఈ కార్యక్రమానికి శిక్షకుడిగా చార్టెడ్ అకౌంట్ తరుణ్ పాల్గొని, విద్యార్థులకు కెరీర్ మార్గదర్శనం, సోషల్ మీడియా బాధ్యతాయుత వినియోగం, డిజిటల్ గాడ్జెట్ల వినియోగంలో చేయాల్సినవి, చేయకూడనివి వంటి అంశాలపై అవగాహన కల్పించారు. జేసీఐ ఇచ్ఛాపురం అధ్యక్షులు బోయిన శ్రావణ్ విద్యార్థులతో సంభాషించి ఉత్సాహాన్ని అభినందించారు. భవిష్యత్తులో కూడా విద్యార్థుల అభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జేసీఐ సభ్యులు జయదేవ్, షణ్ముక్, సంతోష్, రేణుకాదేవి, మట్ట శ్రీనివాస్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

## శాంతినికేతన్‌లో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ




**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 17(వార్త):** ఇచ్ఛాపురంలోని శాంతినికేతన్ స్కూల్‌లో నులి పురుగుల నివారణ మాత్రలను మంగళవారం స్కూల్ చైర్మన్ డి.కృష్ణమూర్తి రెడ్డి విద్యార్థులకు వేయించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కె.సి. పూరి, ఉపాధ్యాయులు సురేఖ, రవి ఆశ వర్కర్లు బి. యర్రమ్మ, కె. రామలక్ష్మి, ఎస్. సరోజ పాల్గొన్నారు.

## కార్మికుల సంఘం ఆర్థిక సాయం



**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 17(వార్త):** ఈదుపురం కార్మికుల సంఘం ఆధ్వర్యంలో అనారోగ్యంతో బాధపడుతున్న శివ బెహరాకు రూ.33 వేల ఆర్థిక సాయం అందజేశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్స కోసం తిరుగుతున్న శివ బెహరాకు మెడికల్ ఖర్చులు భారంగా మారడంతో, కార్మికుల సంఘం సభ్యులు స్పందించి ఆర్థిక సహాయం అందజేశారు. స్థానికులు సంఘం సేవలను అభినందిం చారు.

## రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలకు శ్రీకాకుళం క్రీడాకారుల ఎంపిక



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 17(వార్త):** శ్రీకాకుళంలోని బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియంలో మంగళవారం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చదరంగం పోటీలు ఉత్సాహంగా జరిగాయి. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ ఎంపిక పోటీల్లో జిల్లా వ్యాప్తంగా సుమారు వంద మంది బాలబాలికలు పాల్గొన్నారు. పదమూడేళ్ల లోపు బాలికల విభాగంలో బొల్లా శృతి, వైశ్యరాజు రోషిణి, బాలుర విభాగంలో బలివాడ జయంత్, బస్వ భానుతేజ్ ప్రతిభ చాటారు. పదిహేనేళ్ల లోపు బాలుర విభాగంలో బొల్లా యశ్వంత్, బగాది కార్తికేయ, బాలికల విభాగంలో మెట్ట ప్రణీత, వడవలస లోచన విజేతలుగా నిలిచారు. పందొమ్మిదేళ్ల లోపు బాలికల విభాగంలో రుప్ప మహాలక్ష్మి, కూన ప్రమీల రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన ఈ క్రీడాకారులు ఈ నెల 21వ తేదీన తిరుపతిలో జరగనున్న రాష్ట్ర స్థాయి చదరంగం పోటీల్లో శ్రీకాకుళం జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించనున్నట్లు జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను పలువురు అధికారులు, క్రీడాభిమానులు అభినందిస్తూ, రాష్ట్ర స్థాయిలో కూడా ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు.

## బడ్జెట్‌లో బీసీ సంక్షేమానికి పెద్ద పీట



**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 17(వార్త):** రాష్ట్రంలో జరిగిన బడ్జెట్ సమావేశాల్లో బీసీ వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చిందని రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ కొండా శంకర్ రెడ్డి అన్నారు. ఆయన తెలుగుదేశం పార్టీ ఆఫీసులో జరిగిన విలేకరుల సమావేశంలో తెలిపారు. సమావేశంలో శంకర్ నారాయణ, జోగా రెడ్డి, ప్రసాద్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, పలువురు నేతలు పాల్గొన్నారు .బడ్జెట్ సమావేశాల్లో బీసీ సంక్షేమానికి గణనీయమైన నిధులు కేటాయించడాన్ని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, 2025-2026 బడ్జెట్ సమావేశాల్లో 47, 456 కోట్ల రూపాయలను కేటాయించగా 2026-2027లో ఏకంగా 51,021 కోట్ల రూపాయలను కేటాయించిన విధానం చూస్తుంటే బీసీ వర్గాలను మేలు చేయడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. విద్యాభివృద్ధి కోసం హాస్టళ్లు, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలకు పెరిగిన నిధులు విద్యార్థులకు ఎంతో మేలు చేస్తాయన్నారు. స్వయం ఉపాధి, చిన్న వ్యాపారాల ప్రోత్సాహానికి ప్రత్యేక రుణాలు, సబ్సిడీలు కల్పించడం ద్వారా ఆర్థిక స్వావలంబన సాధ్యమవుతుందన్నారు. అలాగే బీసీ కార్పొరేషన్ల ద్వారా మహిళలకు, యువతకు శిక్షణా కార్యక్రమాలు, నైపుణ్యాభివృద్ధి పథకాలు అమలు చేయడం అభినందనీయమని తెలిపారు.

గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో బీసీ వర్గాలకు గృహనిర్మాణం, ఉపాధి అవకాశాలు కల్పిం చేందుకు బడ్జెట్‌లో స్పష్టమైన ప్రణాళికలు ఉన్నాయని వివరించారు. ఈ బడ్జెట్ బీసీ వర్గాల సామాజిక, ఆర్థిక స్థితిని మరింత బలోపేతం చేస్తుం దని, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు తమ పూర్తి మద్దతు ఉంటుం దని చైర్మన్ స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబునాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ, ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## బొత్సపై కిరాక్ ఆర్‌పీ వ్యంగ్య దూషణలు సబబు కాదు

### -ఉత్తరాంధ్ర యాసను కించపరిస్తే ఊరుకునేది లేదు

### - పలాస జిల్లా కేంద్ర సాధన కమిటీ కన్వీనర్ శ్రీధర్



**పలాస, ఫిబ్రవరి 17(వార్త):** వైయస్సార్‌సీపీ విపక్ష నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణపైన జబర్దస్త్ నటుడు కిరాక్ ఆర్.పి వ్యక్తిగతంగా, వ్యంగ్యశీ గా రాజకీయ విమర్శలు చేయడమే కాక ఉత్తరాంధ్ర యాసతో అసభ్యకర రీతిలో మాట్లాడిన తీరు సబబు కాదని ప్రముఖ సామాజికవేత్త, పలాస జిల్లా కేంద్ర సాధన కమిటీ కన్వీనర్ దువ్వాడ శ్రీధర్(బాబా) ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం పలాసలో ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలు, రాజకీయ పార్టీల అండతో నడిపే డిజిటల్ మీడియాలు హద్దులు మీరుతున్నాయని, వ్యక్తిగత.. వ్యంగ్యంగా దూషణలు చేయడం పెచ్చు మీరుతోంద న్నారు. శాసన మండలిలో ప్రభుత్వ వైఫల్యాలను ఒక విపక్ష నేతగా బొత్స సత్యనారా యణ అసెంబ్లీలో ప్రశ్నిస్తుంటే.. పొట్టకూటి కోసం టీవీ ఛానల్ లో స్కిట్లు వేసుకునే కమెడియన్లతో చిల్లర రాజకీయాలు సాగిస్తున్న తీరు జుగుప్సాకరంగా ఉందని దువ్వాడ శ్రీధర్ (బాబా) ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్రలో ఉన్న కొద్దిమంది నాయకుల్లో కీలకమైన బొత్స సత్యనారాయణ ఒకరిని, ఆయన రాజకీయ ప్రయాణంలో ఎందరికో మేలు చేసి, మరి ఎందరికో రాజకీయంగా, సామాజికంగా అండగా నిలబడ్డ వ్యక్తిని, ఒక్క మాటలో చెప్పాలంటే రాజకీయాలలో అన్ని పార్టీల వారు ఆయనకు గౌరవిస్తుంటారని, అంతేకాక ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యం పొంది, దశాబ్దాల పాటు ప్రజాసేవలో అగ్రగామిగా నిలిచిన ఒక పెద్ద నాయకుడు అన్నారు. ఇటీవల కిరాక్ ఆర్ పి చేసిన వ్యాఖ్యలు సభ్య సమాజంలో అభ్యంతరంగా ఉన్నాయన్నారు. ప్రజాస్వామ్యంలో విమర్శలు సహజమని, విధానాలపై, ప్రభుత్వం నిర్ణయాలపై, రాజకీయ వైఖరిపై ఎవరైనా తమ అభిప్రాయాన్ని వ్యక్తపరచవచ్చునన్నారు. అయితే రాజకీయ పెద్దలను నోటికొచ్చినట్లు తూలనాడడం ప్రజాస్వామ్య సాంప్రదాయాలకు విరుద్ధమన్నారు. మన సంస్కృతి పెద్దలను గౌరవించే ధోరణి మనం మరవకూడదన్నారు. మాట ఒక శక్తి. అది నిర్మాణాత్మకంగా ఉపయోగిస్తే సమాజాన్ని ముందుకు తీసుకెళ్తుందని, లేకపోతే విభేదాలను రెచ్చగొడుతుందని, ప్రజా వేదికను వ్యక్తిగత దూషణలకు వేదికగా ఉపయోగించడం సరికాదన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల పరస్పర గౌరవాన్ని, రాజకీయ సంస్కారాన్ని అందరూ గౌరవించుకుని ముందుకు సాగాలని, ఇప్పటికైనా కిరాక్ ఆర్పి చేసిన వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకొని, బహిరంగంగా క్షమాపణ చెప్పాలని దువ్వాడ శ్రీధర్ హితవు పలికారు. భవిష్యత్తులో ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు పునరావృతం కాకుండా రాజకీయ నేతలు, సోషల్ మీడియా యాక్టివిటీస్లు సమన్వయంతో స్వీయ నియంత్రణ కలిగి ఉండాలని, అలాంటప్పుడే ప్రజాస్వామ్యంలో విలువలు పెంపొందుతాయని దువ్వాడ శ్రీధర్ ( బాబా) స్పష్టం చేశారు.

## భిన్నత్వంలో ఏకత్వమే దేశానికి బలం

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 17(వార్త):** యువతలో జాతీయ సమగ్రత పెంపొందించడం ద్వారానే బలమైన దేశ నిర్మాణం సాధ్యమవుతుందని జిల్లా ఉపాధి అధికారిణి కె.సుధ అన్నారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ 'మేరా యువ భారత్' ఆధ్వర్యంలో శ్రీ శివాని ఫార్మసీ కళాశాలలో జరుగుతున్న 'అంతర్ జిల్లా యువజన మార్పిడి' కార్యక్రమాన్ని ఆమె మంగళవారం ప్రారంభించారు. తొలుత స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుధ మాట్లాడుతూ.. వివిధ జిల్లాల యువత ఒకచోట చేరి ఆలోచనలు పంచుకోవడం వల్ల పరస్పర అవగాహన పెరుగుతుందన్నారు. శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు మనమంతా ఒక్కటే అనే 'సమగ్రత' భావన యువతలో కలగాలి. విభిన్న సంస్కృతులను అర్థం చేసుకోవడం వల్ల ప్రాంతీయ విభేదాలు తొలిగి, స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందని ఆమె వివరించారు. ఈ వేదిక యువత తమ నైపుణ్యాలను, జిల్లాల్లోని ఉత్తమ పద్ధతులను పంచుకోవడానికి చక్కని అవకాశమని పేర్కొన్నారు.

మేరా యువ భారత్ డిప్యూటీ డైరెక్టర్ కె. వెంకట్ ఉజ్వల్ మాట్లాడుతూ.. ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ శిబిరంలో నెల్లూరు నుంచి వచ్చిన యువతకు మన జిల్లాలోని చారిత్రక, సాంస్కృతిక ప్రదేశాలను క్షేత్రస్థాయిలో చూపిస్తామన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు, శ్రమదాన్, చర్చా వేదికల ద్వారా నాయకత్వ లక్షణాలను మెరుగుపరుస్తామని తెలిపారు. యువజన సర్వీసుల శాఖ సీఈఓ వి.వి. అప్పలనాయుడు మాట్లాడుతూ.. చక్కని క్రమశిక్షణతో కూడిన ఇలాంటి శిబిరాలు యువత భవిష్యత్తుకు బాటలు వేస్తాయన్నారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి నారాయణరావు, కళాశాల పీడీ టి. బాలాజీరావు, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డా. బి. ప్రసాదరావు, గణాంక అధికారి డి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వాలంటీర్లు అరుగుల దిలీప్‌కుమార్, మట్టా ప్రియాంక, గార మౌనిక, అజిత్, నెల్లూరు జిల్లా యువతీ యువకులు పాల్గొన్నారు.




## అప్పుల ఊబి నుంచి.. అభివృద్ధి వైపు సంక్షేమం.. అభివృద్ధి ఎజెండాగా రాష్ట్ర బడ్జెట్

### -జనసేన పార్టీ నేత నందిగాం ధర్మారావు



**పలాస, ఫిబ్రవరి 17(వార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించిన 2026- 27 వార్షిక బడ్జెట్‌ను శాసనసభలో ప్రవేశపెట్టిన కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమం, అన్నదాతల సంక్షే మం, మహిళా సాధికారిత, విద్యాభివృద్ధి, మౌలిక రంగ సదుపాయాలు విస్తరణ లక్ష్యాలుగా రూపొందించిన ఈ బడ్జెట్ రాష్ట్ర అభివృద్ధికి ఎంతో తోడ్పాటు ఇస్తుందని జనసేన పార్టీ పలాస పట్టణ యువజన నేత నందిగాం ధర్మా రావు వ్యాఖ్యానించారు. మంగళవారం ఆయన పలాసలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను సమగ్రంగా విశ్లేషించి, సమతుల్య దృక్పథంతో కేటాయింపులు చేయబడిన తీరు కూటమి ప్రభుత్వ పరిపాలన దక్షతకు స్పష్టంగా ప్రతిబింబిస్తుందన్నారు. సంక్షేమం, అభి,వృద్ధి అనే రెండు చక్రాలపై రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లే విధంగా ఈ బడ్జెట్ రూప కల్పన జరిగినట్లు స్పష్టమవుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్ల లతో వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు ఈ బడ్జెట్ ఒక వరమని నందిగాం ధర్మారావు కొనియా డారు. రోడ్లు, ఓడరేవులు, విమానాశ్రయాలకు 13 వేల కోట్ల రూపాయలు కేటా యింపు శుభ పరిణామన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు వలన నిన్నటి వరకు అప్పులు ఊబిలో ఉన్న ఆంధ్ర ప్రదేశ్ ను అభివృద్ధి వైపు పరుగు తీసేలా ఈ బడ్జెట్ ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ కేటాయింపుల వివరాలను నిశితంగా పరిశీలించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నిర్దేశించుకున్న లక్ష్యాలను ఈ బడ్జెట్ ద్వారా మరింత వేగంగా చేరువ అవ్వచ్చునని తన విశ్వాసాన్ని నందిగాం ధర్మారావు స్పష్టం చేశారు. ప్రజల అవస రాలు, సంక్షేమం, అభివృద్ధి అంశాలను దృష్టిలో ఉంచుకొని విద్య, వైద్యం, వ్యవసా యం, మౌలిక సదుపాయాలు, యువతకు ఉపాధి వంటి కీలక రంగాలకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమన్నారు. గ్రామీణ రహదారులు, తాగు నీటి పథకాలు, పారిశ్రామిక అభివృద్ధి, ఐటీ రంగ ప్రోత్సాహానికి కేటాయించిన నిధులు రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది ఈ బడ్జెట్ వేస్తుందన్నారు. ముఖ్యంగా రాష్ట్ర వ్యవ సాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శ్రీకాకుళం జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించడంతో జీడి..మామిడి మరింత విస్తరించేందుకు జీడి క్లస్టర్ ఏర్పాటు చేసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, అంతేకాక మూలపేట పోర్టు సకాలంలో నిర్మాణం పూర్తి కాబట్టే వ్యవసాయ ఆధారిత వస్తువులు ఎగుమతులు, దిగుమతులకు ఎంతో ఉప యోగం ఉంటుందని, పారిశ్రామిక రంగం విస్తరించే అవకాశం ఉందన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ఆదిత్యుని అన్నదాన పథకానికి రూ.లక్ష వితరణ

**అరసవల్లి, ఫిబ్రవరి17(వార్త):** ప్రత్యక్షదైవం ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణ స్వామి వారిని మంగళవారం సాయంత్రం విశాఖపట్నం వాస్తవ్యులు మణికేశ్వరి దర్శించుకున్నారు. అంతకుముందు ఆదిత్యుని అన్నదానం పథకానికి గాను రూ.1,11,116 చెక్కు ద్వారా ఆలయ కార్యనిర్వాహణాధికారి ప్రసాద్‌కు అందజేశారు. వారికి ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామి వారి ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు.



# జూన్ నుంచి కేంద్రీయ విద్యాలయ తరగతులు

* ఏప్రిల్‌లో ఆర్వోబీ పూర్తి కావాలి
* కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు
* పలాస పట్టణంలో మంత్రి సుడిగాలి పర్యటన



**పలాస, ఫిబ్రవరి 17(వార్త) :** కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు మంగళవారం పలాస పట్టణంలో సుడిగాలి పర్యటన చేపట్టారు. ఉదయం 9 గంటలకు పలాస చేరుకున్న కేంద్ర మంత్రి తొలుత రైల్వే స్టేషన్ సమీపంలోని ఫ్లైఓవర్ వంతెన పనులను సమీక్షించారు. ప్రాజెక్ట్ రిపోర్టును పరిశీలించి.. ప్రస్తుత స్థితిని ఆరా తీశారు. పనుల్లో ఆలస్యం జరుగుతోందని, రేయింబవళ్ళు పనులు జరగాలని స్పష్టం చేశారు. ఏప్రిల్ నాటికి వంతెనను అందుబాటులోకి తీసుకురావాలని అదేశించారు. రైల్వే వంతెన తో పాటు ఆనుకుని సర్వీసు రోడ్డు పనులు కూడా వేగంగా జరపాలని తెలిపారు. అనంతరం అక్కడి నుండి పలాస లోని నెమలికొండ ప్రాంతాలలో త్వరలో నిర్మాణం జరగనున్న కేంద్రీయ విద్యాలయ ప్రాంతాన్ని పరిశీలించారు. భవనాలు నిర్మాణం జరిగే తీరును ప్రాజెక్టు రిపోర్టు ద్వారా కేంద్ర మంత్రికి కలెక్టర్, ఆర్డీవో వివరించారు. పాఠశాలకు అనుసంధానం అయ్యే రోడ్లు, ఇతర మౌలిక వసతులను ఆరా తీశారు. అక్కడి నుండి పలాస పట్టణంలోని రైల్వే కాలనీలో బారక్ భవనాలను పరిశీలించారు. రాబోయే విద్యా సంవత్సరం తరగతులను ఈ భవనాలు నుండి జరపాలని నిర్ణయించిన నేపథ్యంలో రైల్వే అధికారులతో గదుల అప్పగింతపై అనుమతుల సమస్యను పరిష్కరించారు. కేంద్రీయ విద్యాలయ అధికారులతో సమన్వయం చేసుకుని ఈ ఏడాది తరగతులు పక్కగా నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మీడియా రామ్మోహన్ నాయుడు మాట్లాడారు. పలాస పరిసర ప్రాంతాలతో పాటు జిల్లా వాసుల ఎన్నో ఏళ్ల కల అయిన, పలాస ఆర్‌ఓబీ ప్రాజెక్టు ఇప్పుడు వేగంగా నిర్మాణం జరుగుతూ ఉండటం ఆనందంగా ఉందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దీనికి అత్యున్నత ప్రాధాన్యత ఇచ్చి, ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పనులను తిరిగి ప్రారంభించామని తెలిపారు. భారతీయ రైల్వే మరియు జిల్లా యంత్రాంగం సమన్వయంతో నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని అన్నారు. ఈ నిర్మాణం పూర్తి అయితే పలాస పట్టణంలో ట్రాఫిక్ రద్దీ తగ్గి ప్రయాణికులకు సౌకర్యవంతమైన రాకపోకలు కలుగుతాయని అన్నారు. అలాగే పలాస లో ఏర్పాటు కానున్న కేంద్రీయ విద్యాలయంలో రాబోయే విద్యాసంవత్సరం నుండే తరగతుల నిర్వహణ కోసం ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. రైల్వే అధికారులతో మాట్లాడి బారెక్ భవనాలకు సంబంధించిన అనుమతుల సమస్యను పరిష్కరించామని తెలిపారు. ఈ పాఠశాల ద్వారా సాయుధ దళాల సిబ్బంది, కేంద్ర సంస్థల ఉద్యోగుల పిల్లలకు నాణ్యమైన విద్యా అవకాశాలు లభిస్తాయనీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి శ్రేణులు, రెవెన్యూ, రైల్వే అధికారులు స్థానికులు పాల్గొన్నారు.

# చక్రతీర్ధ స్నానాలకు పటిష్ట పోలీసు బందోబస్తు

* భక్తులకు అసౌకర్యం లేకుండా ప్రణాళిక
* ప్రైవేట్ డ్రోన్ల వినియోగం నిషేధం
* సమన్వయంతో విధులు నిర్వర్తించాలి
* పోలీసులకు భక్తులు సహకరించాలి
* జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి



**జలుమూరు, ఫిబ్రవరి 17 (వార్త):** శ్రీముఖలింగంలోని శ్రీముఖలింగేశ్వర స్వామి దేవస్థానం చక్రతీర్థ స్నానాల సందర్భంగా జిల్లా పోలీసు శాఖ విస్తృత భద్రతా ఏర్పాట్లు చేసిందని, సుమారు 1000 మంది అధికారులు, సిబ్బందితో ప్రశాంతంగా ఉత్సవం నిర్వహించేందుకు పక్కా ప్రణాళిక సిద్ధం చేశామని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా ఎస్పీ శ్రీ కె.వి. మహేశ్వర రెడ్డి శ్రీముఖలింగం ఆలయం, వంశధార నది మార్గం, స్నానాలు జరిగే ప్రదేశాన్ని కాలినడక ద్వారా సందర్శించి తుది ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి బందోబస్తు విధుల్లో ఉన్న అధికారులకు పలు ముఖ్య సూచనలు చేశారు. చక్రతీర్థ స్నానాల రోజున స్వామివారి ఉత్సవ విగ్రహాలు వెళ్లే మార్గం, నదిలో స్నాన ఏర్పాట్లు, బారికేడ్ల నిర్మాణం, రూట్ మ్యాప్, పార్కింగ్ స్థలాలు, కంట్రోల్ రూమ్ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సుమారు రెండు కిలోమీటర్ల మేరకు ఇరువైపులా భారీ రోపు పార్టీలు ఏర్పాటు చేసి, భక్తుల రాకపోకలను క్రమబద్ధీకరించాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేక సూచిక బోర్డులు ఏర్పాటు చేసి, ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బుధవారం జరిగే చక్రతీర్థ స్నానాలకు లక్ష మందికి పైగా భక్తులు హాజరవుతారని అంచనా వేస్తూ, ఆ మేరకు భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు ఎస్పీ వెల్లడించారు. ఇందుకోసం సుమారు వెయ్యి మంది సివిల్, ఏ ఆర్,స్పెషల్ పార్టీ ఫోర్స్, రోప్ పార్టీ, లా ౘ ఆర్డర్ , హోంగార్డ్ సిబ్బంది విధుల్లో పాల్గొంటారని తెలిపారు. పోలీసు, రెవెన్యూ, ఆలయ అధికారులతో సమన్వయం చేసుకుని ప్రత్యేక కార్యాచరణ రూపొందించబడిందన్నారు. ఉత్సవ విగ్రహాల ప్రయాణ మార్గమంతా సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాల పర్యవేక్షణలో ఉంచి, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పోలీసులకు సహకరించి ప్రశాంత వాతావరణంలో చక్రతీర్థ స్నానాలు నిర్వహించేందుకు సహాయ సహకారాలు అందించాలని జిల్లా ఎస్పీ కోరారు. అనంతరం బందోబస్తు విధుల్లో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బందితో మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా క్రమబద్ధమైన ఏర్పాట్లు చేయాలని, ప్రతి భక్తులు స్వామి వారి స్నానాలు ఆచరించేలా అప్రమత్తంగా ఉంటూ అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని,విధి నిర్వహణ లపై జిల్లా ఎస్పీ పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు.



### ప్రైవేట్ డ్రోన్ల వినియోగం నిషేధం

శ్రీముఖలింగేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం జరుగుతున్న చక్రతీర్థ స్నానాల సందర్భంగా భద్రతా కారణాల దృష్ట్యా ఆలయం పరిసర ప్రాంతాలు, స్వామివారి స్నానాలు ఆచరించే వంశధార నది పరివాహక ప్రాంతాల్లో ప్రైవేట్ డ్రోన్ల ఎగరడం పూర్తిగా నిషేధించబడిందని జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి తెలిపారు. చక్రతీర్థ స్నానాలు పూర్తయ్యే వరకు పోలీసు శాఖ నుంచి ఎటువంటి అనుమతి లేకుండా ప్రైవేట్ డ్రోన్లు ఎగర వేయరాదన్నారు. భక్తుల భద్రత, ప్రజా శాంతి భద్రతలు దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామని అధికారులు తెలిపారు. ఈ ఆదేశాలను ఉల్లంఘించి డ్రోన్లు ఎగర వేయడం లేదా అనుమతి లేకుండా చిత్రీకరణ చేయడం వంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోబడతాయని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. ఈ పరిశీలనలో అదనపు ఎస్పీలు కె.వి. రమణ, పి. శ్రీనివాసరావు, సహాయ (ట్రైనీ) కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, ఆర్డీవో సాయి ప్రత్యూష, డీఎస్పీలు వివేకానంద, షేక్ షాహబాజ్ అహ్మద్, లక్ష్మణరావు, గోవిందరావు, శేషాద్రి తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# చక్రతీర్ధ స్నానాలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

**జలుమూరు, ఫిబ్రవరి 17(వార్త):** చక్రతీర్థ స్నానాల ఏర్పాట్లను ఆర్డీవో సాయి ప్రత్యూష సోమవారం మధ్యాహ్నం పరిశీలించారు. శ్రీముఖలింగంలో జరిగే ఈ మహోత్సవానికి లక్షలాది మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. వంశధార నది మిరియాపల్లి రేవు వద్ద స్వామివారి చక్రతీర్థం జరిగే ప్రదేశాన్ని ఆర్డీవో పరిశీలించారు. ఎటువంటి పొరపాట్లు చోటుచేసుకున్నా అన్ని శాఖలపై మచ్చ పడుతుందని, అందువల్ల ప్రతి విభాగం సమర్ధవంతంగా పని చేయాలని ఆమె ఆదేశించారు. నదిలో ఏర్పాటు చేసిన భారీ బారికేడ్లను పరిశీలించి, భక్తుల రాకపోకల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దృష్టి సారించారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రంలో బుధవారం జరిగే చక్రతీర్థ స్నానాల కోసం వంశధార నది తీరం మిరియాపల్లి రేవు ప్రాంతంలో పచ్చని పందిర్లు ఏర్పాటు చేశారు. స్వామివారి స్థానం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఆలయం నుంచి స్నాన ఘాట్ వరకు భక్తులకు సౌకర్యవంతమైన మార్గాలను ఏర్పాటు చేశారు. భక్తుల రాకపోకల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ భద్రతా చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఏర్పాట్లను తహసీల్దార్ జన్ని రామారావు, కార్యనిర్వాహక అధికారి ఏడుకొండలు తదితరులు పర్యవేక్షించారు.



## రీసర్వే లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి




**శ్రీకాకుళం, ఫిబ్రవరి 17(వార్త):** జిల్లాలో భూముల రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని, వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో ఉన్న వ్యత్యాసాలను తక్షణమే సరిదిద్దాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తో కలసి మంగళవారం కలెక్టరేట్ నుంచి తహసీల్దార్లు, ఎంపీడీఓలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన రీ-సర్వే పురోగతిపై గణాంకాలతో సహా సుదీర్ఘంగా సమీక్షించారు. ప్రస్తుతం జిల్లాలో 4వ దశ రీ-సర్వే 167 గ్రామాల్లో లక్ష్యంగా పెట్టుకోగా, ఫిబ్రవరి 16 నాటికి 24 గ్రామాల్లో సర్వే పూర్తయిందని, మిగిలిన 143 గ్రామాల్లో సర్వే పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో 'ఇతరులు' అనే పేరుతో ఉన్న భూముల వివరాలను పరిశీలిస్తే, జిల్లా వ్యాప్తంగా 29,953 సర్వే నంబర్లలో వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించారు. దీనికి సంబంధించిన మొత్తం భూమి విస్తీర్ణం 7,709.22 ఎకరాలుగా ఉందన్నారు. వీటిపై కూడా రెవెన్యూ యంత్రాంగం తగిన దృష్టి సారించాలని ఆదేశించారు. అలాగే మొత్తం 1,74,941 ఎల్.పి.ఎంలలో ఇంకా పెండింగ్‌లో ఉన్న వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని హెచ్చరించారు. రికార్డుల అప్‌లోడింగ్‌లో ఎటువంటి తప్పులు జరగకూడదని, రైతులు ఇబ్బంది పడకుండా సర్వే ప్రక్రియ పారదర్శకగా సాగాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అలాగే పట్టాదారు పాస్‌బుక్కుల జారీ ప్రక్రియపై కలెక్టర్ ప్రత్యేకంగా సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 5,133 ఖాతాలను పరిశీలించగా, అందులో 4,576 ఖాతాలు ముద్రణకు సిద్ధంగా ఉన్నాయని, ఇంకా 1,764 ఖాతాల్లో వ్యక్తిగత సమాచార సవరణలు అవసరమని, మరో 190 ఖాతాల్లో మ్యుటేషన్లు పెండింగ్‌లో ఉన్నాయని గుర్తించిన కలెక్టర్, వీటిని తక్షణమే పరిష్కరించి వంద శాతం లక్ష్యాన్ని చేరుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా స్థాయి అధికారులతో పాటు మండలాల నుంచి తహసీల్దార్లు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్‌లో జోగారావు సత్తా



**నరసన్నపేట, ఫిబ్రవరి 17(వార్త):** మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని జబల్పూర్లో ఈనెల 13 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించిన జాతీయ స్థాయి ఇండియన్ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో నరసన్నపేటకు చెందిన పాగోటి జోగారావు విశేష ప్రతిభ కనబరిచారు. 40 ప్లస్ వయస్సు విభాగంలో పోటీపడిన జోగారావు పరుగు పందెంలో గోల్డ్ మెడల్ సాధించడంతో పాటు 1600 మీటర్ల పరుగు పందెంలో మరో గోల్డ్‌ను కైవసం చేసుకున్నారు. అదనంగా పోల్ వాల్ట్ విభాగంలో కూడా బంగారు పతకం అందుకున్నారు. ట్రిపుల్ జంప్‌లో సిల్వర్ మెడల్, లాంగ్ జంప్‌లో బ్రాంజ్ మెడల్ సాధించి మొత్తం ఐదు పతకాలతో మెరిశారు. ఆయన సాధించిన విజయంపై నరసన్నపేట ప్రజలు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. జాతీయ స్థాయిలో పలుముఖ పోటీల్లో ప్రతిభ కనబరచి జిల్లాకు కీర్తి తీసుకురావడం గర్వకారణమని స్థానికులు పేర్కొన్నారు.

## రక్తహీనత నివారణకు డీవార్మింగ్ మాత్రలు



**జలుమూరు, ఫిబ్రవరి 17(వార్త):** రక్తహీనత నివారణకు డీ-వార్మింగ్ మాత్రలు వినియోగం ఎంతో ప్రయోజనకరమని వైద్యశాఖ సిబ్బంది పేర్కొన్నారు. మంగళవారం జలుమూరు ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు డీ-వార్మింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యసిబ్బంది మాట్లాడుతూ, కడుపులో పురుగులు ఉండటం వల్ల పోషకాహార లోపం, రక్తహీనత వంటి సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. డీ-వార్మింగ్ మాత్రలు వేసుకోవడం ద్వారా ఈ సమస్యలను నివారించవచ్చని వివరించారు. ప్రతి నాలుగు లేదా ఆరు నెలలకు ఒకసారి ఈ మాత్రలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్య రక్షణ కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మాధవరావు, ఉపాధ్యాయులు రామారావు తదితరులు పాల్గొన్నారు.

## వీఆర్వోల నిరసన

**పోలాకి, ఫిబ్రవరి 17(వార్త):** అధికారులు అధిక పని ఒత్తిడి పెంచుతూ మానసికంగా వేధిస్తున్నారని ఆరోపిస్తూ వీఆర్వోలు మంగళవారం నిరసనకు దిగారు. పోలాకి తహసీల్దార్ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన జాబ్ చార్ట్ ప్రకారం విధులు నిర్వహిస్తున్నప్పటికీ అదనపు పనులను అప్పగిస్తూ ఒత్తిడి తీసుకురావడం సరికాదని వీఆర్వోలు పేర్కొన్నారు. ఈ విధమైన ఒత్తిడి కారణంగా పలువురు సిబ్బంది అనారోగ్యానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర సంఘం పిలుపుమేరకు ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు పెద్దఎత్తున పాల్గొని తమ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546